# ఒక్కనాటి అతిథి

ప్రొద్దువాలుతోంది. జనసమ్మర్దం ఏమీలేదు. కనుచూపు దూరంలో బాటసార్లుకూడా ఎవరూ వస్తున్నట్టు కనుపించలేదు. పొద్దువాలి, చెట్లసందుల్లో నీడలుదట్టమై మసకమసకగా ఉన్నప్పుడు, మనస్సు దిగులు దిగులుగా ఉంటుంది. ఆ కాస్సేపు ఒంటరితనం భయంకరమైనది. ఆ నిమిషం తప్పనిసరిగా ఎవరైనా దగ్గరగా ఉండాలి, నవ్వుతూ గలగలా కబుర్లు చెప్పడానికి, కమ్ముకు వస్తూన్న చీకట్ల భయాన్ని తొలగించడానికి.

కాని రోజూ ఎవరూ ఉండరు. అది బాటసార్లు వచ్చే సమయంకాదు, తిరిగి వెళ్ళిపోయే సమయం. కాని, కాస్సేపు మసకచీకటి, ఆ తరువాత దట్టంగా చీకటి కమ్ముకుంటుంది. ఆకాశం నక్షత్రాలతో నిండిపోతుంది. సాయంత్రం ఆర్త నాదంలా అంతటా వ్యాపించిన పక్షుల గలగల సద్దుమణిగి, అంతటా ప్రశాంతమైన నిశ్శబ్దం నిండుకుంటుంది. అప్పుడిక భయంలేదు. తలుపులు వేసుకుని నిద్రలో ప్రపంచాన్ని మరచి పోవచ్చు.

కాని, ఆమసక చీకటికీ, ఈ కటిక చీకటికీ మధ్యక్షణాలు ఆనందంగా సాగిపోతున్నట్టుంటుంది కేతకికి. ఆ కాస్సేపు ఏదో ఆరాటమూ, ఆ వేదన, దేనికోసమో ఎదురు చూస్తునట్లు ఆతృత ! హృదయంలో నిండిన ఈ దిగులు స్వరూపమేమిటో ఆమె చెప్పలేదు. వేదన ఏదో లోలోపల దాగిఉన్నట్లుమాత్రం

తెలుసు. మూతపెట్టిన గిన్నెలో పైకి ఉబకకుండా ఏదో లోలోపల కుతకుతమని ఉడికినట్లు హృదయం ఏదో మూగ బాధతో ఆరాటపడుతుంది.

ఆ ప్రదేశం అసలు నిర్మానుష్యమైనది. ఎవరూ అక్కడ ఇళ్ళుకట్టుకుని కాపరాలు లేరు. అది నాలుగుపల్లెలకు మధ్యగా ఉన్నది. నాలుగు వేపులకు అక్కడినుంచి కాలిబాటలున్నాయి. ఏ త్రోవన వెళ్ళినా రెండుమూడు మైళ్ళు నడిస్తేనేగాని ఊరు తగలదు ఇక దగ్గరగా ఉన్నవన్నీ చిన్నచిన్న గుట్టలు, బండలు, విశ్రాంతిగా పెరిగి పెద్దవై దగ్గరదగ్గరగా పెద్ద పందిరిలా అలముకొన్న పొగడచెట్లు, అక్కడక్కడా దూరాన ముళ్ళ కంపలు. ఆ ప్రదేశంలో ఉంటే ప్రకృతికి చేరువగా, ప్రకృతి ఒడిలోపుట్టి పెరుగుతున్నట్లుంటుంది. పొగడచెట్లు ఎక్కువగా వుండడంచేత ఆ చుట్టుపట్ల ఆ ప్రదేశానికి పొగడతోట అని పేరు.

నాలుగు కాలిబాటలు కలిసినచోట కొంచెం ఎత్తయిన గుట్టమీద ఓ చిన్నపాక వుంది. పాకకు ముందు ఓ చిన్న పందిరి, చుట్టూ నున్నని ఖాళీస్థలం, ఆ తరువాత అంతటా పెద్ద పెద్ద పొగడచెట్లు, వాటిక్రింద విశాలమైన నున్నని రాతిబండలూ వున్నాయి. అది కేతకి ప్రస్తుత నివాసం. చిన్నప్పటి నుంచీ ప్రతి వేసవికీ అక్కడే మకాం, ఆమె తండ్రి గౌరయ్య.

అక్కడికి దగ్గరగా వున్న పల్లె సుమాల ఆమె ఊరు. ఆ ఊరు అట్టే పెద్దదికాదు. అయినా ఆ ఊళ్ళో కొందరు

మోతుబరి రైతులున్నారు, డబ్బున్న ఆసాములున్నారు, చేతి కద్దంలేకుండా దానధర్మాలుచేసే దాతలూ ఉన్నారు. ఊరికి పడమరగా పంటకాలవ ఉన్నది పెద్దది. ఎప్పుడూ ఎడ తెగకుండా ప్రవహించేది. ఆ కాలువకు చేరువగా మరొక దిక్కునే వేణు గోపాలస్వామి ఆలయం ఉన్నది. అది చాలా పురాతనమైంది. ఎప్పుడు ఎవరు కట్టించారో తెలియదు. ఏవో కథలు మాత్రం చాలా చెబుతారు దాన్ని గురించి. ఆ దేవాలయం అతి విశాల మైనది. దాని ఆవరణ చల్లగా ప్రశాంతంగా ఉంటుంది. సాయంత్రం వేళ ఆఊరివారంతా అక్కడికే చేరుతారు, కాస్సేపు విశ్రాంతిగా కూచుని మాట్లాడుకోడానికి, స్వామి దర్శనానికి.

ఆ ఊళ్ళోకల్లా ధనవంతుడు కేశవయ్య. ఆయనకున్న వ్యసనాలలో ముఖ్యమైనది దానధర్మాలు చేయాలనే విపరీత మైన కోరిక. తాను ఏదో ధర్మకార్యం చెయ్యాలి, నలుగురూ దాన్నిగురించి గొప్పగా చెప్పుకోవాలి. ఇది ఒక చపలత్వం. ఆయన విధిగా జరిపే ధర్మకార్యాలలో ప్రతివేసవికి చలిపందిరి నడపటం ఒకటి, ఆ పొగడతోట దగ్గర నాలుగు పల్లెలకు మధ్యగా.

ఆ నాలుగు కాలిబాటలు కలిసేచోట చక్కగా చిన్న పందిరి. పాకవేయించి వచ్చేపోయేవాళ్ళకు చల్లని నీళ్ళు, పుల్లని మజ్జిగఇచ్చే ఏర్పాటు చేయిస్తాడు. అక్కడవుండి ఆ భారం వహించాల్సిన బాధ్యతమాత్రం గౌరయ్యది. అతను కేశ వయ్యను కనిపెట్టుకున్నవారిలో ఒకడు. ఎన్నో ఏళ్ళగా ఆ చిన్న

పాక అతని వేసవి విడిది. ఏనిమిదేళ్ళు వచ్చినప్పటినుంచి అతనితోపాటు కేతకి కూడా అక్కడే మకాం చేస్తున్నది అతనికి వండిపెట్టడానికి. ఆమె తల్లి సుముఖి ఇంటిదగ్గరే ఉంటుంది, ఇంటిపనులు, పాడి వగయిరా చూసుకోడానికి.

చీకటితో లేచి గౌరయ్య పల్లెకు వెళ్ళుతాడు మజ్జిగ, కుండలు తేవడానికి. పొద్దెక్కబోతుండగా తిరిగి వస్తాడు. చీకటితో లేచి కేతకి పందిరిపాక ఊడ్చి బాగుచేస్తుంది. కుండలన్నీ కడుగుతుంది. గుమ్మంలో ముగ్గులు పెడుతుంది. దూరంగా ఉన్న మంచినీళ్ళ బావినుంచి నీరు తెచ్చి కుండలు నింపుతుంది. గౌరయ్య రాగానే రాత్రి వండిన అన్నం అతనికిపెట్టి తానూ తింటుంది.

కొంచెం ఎండ ఎక్కినకొద్దీ ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. దాహమని ఆయాసపడుతూ వచ్చినవాళ్ళు వెంటనే వెళ్ళిపోరు. చల్లటి నీళ్ళు తాగి, కాస్సేపు పందిట్లో ఏవో కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. గౌరయ్య చుట్టకాల్చుకుంటూ వాళ్ళ కబుర్లు వింటూ ఉంటాడు. మధ్యమధ్య తనూ మాటలు కలుపుతాడు. వచ్చే వాళ్ళల్లో చాలమంది అతనికి తెలిసిన వాళ్ళే! ఎవరో కొందరు కొత్తవాళ్ళు.

కేతకి ఎవరితోను మాట్లాడదు. పలకరిస్తే జవాబు చెప్పడం తప్ప, వేరే మాట్లాడటం ఆమెకు అలవాటులేదు. మౌనంగా అందరికి కావలసినవి అందిస్తుంది. కొంచెంసేపు వాళ్ళకబుర్లు వింటుంది. ఏమీ తోచకపోతే వెనకాల పాక

లోకో, లేక దాని వెనకాల ఉన్న పొగడ చెట్ల దగ్గరకో వెళ్ళి పోతుంది.

పొద్దువాలే వేళ బాటసార్ల తాకిడి తగ్గుతుంది. క్రమంగా ఎవరూ రారు. గౌరయ్య గుమ్మంలో చుట్ట కాల్చుకుంటూ దిక్కులు చూస్తూ కూర్చుంటాడు. కేతకి మరొకసారి పాక పందిరిఊడ్చి కుండలు కడుగుతుంది. అన్నం వండుతుంది. చీకటి పడేవరకు భయం భయంగా దిగులు దిగులుగా అస్తమిస్తున్న సూర్యుణ్ని చూస్తూ ఉంటుంది. చీకటిపడ్డాక తండ్రికి అన్నం పెట్టి తాను తింటుంది. భోజనం కాగానే గౌరయ్య దుప్పటి పరచుకుని నిశ్చింతగా నిద్రపోతాడు కేతకికి ఎంతకూ నిద్రరాదు. చాలా సేపు నక్షత్రాలను చూస్తూ పడుకుంటుంది. ఎప్పుడో ఆమెకు తెలియకుండానే నిద్రపడుతుంది.

ఆ వేళ అంతే జరిగింది. పొద్దు వాలుతూ ఉండగా గౌరయ్య గుమ్మంలో కూర్చున్నాడు, చుట్టపొగ వదులుతూ. మండు వేసవి వేడిగాలి ఉండిఉండి తపన రేపుతున్నది. పాకలో కేతకి పొయ్యిమీద పెట్టిన అన్నం కుత కుతమని చప్పుడు చేస్తోంది. పాకకు దూరంగా తండ్రికి ఎదురుగా పొగడచెట్టు క్రింద పెద్ద రాతిబండమీద దిగులుగా కూర్చుంది కేతకి. దూరంగా నల్లని కొండలకు వెనుకగా అస్తమిస్తున్న సూర్యుని చుట్టూ కావిరంగు అందంగా మెరుస్తోంది.

కేతకి నలువైపులా చూచింది. దూరాన చెట్లగుంపు లోని కాలిబాటమీదుగా ఎవరో మెల్లగా వస్తున్నారు. ఆ

వ్యక్తి ముఖం స్పష్టంగా కనిపించడంలేదు. వేషం విచిత్రంగా ఉన్నది. ఎర్రనిపంచ, తెల్లనిచొక్కా తలమీద గాలికి కదల పోతున్న పచ్చనిపాగా, చేతిలో నీలిరంగు సంచి, ఏదో జాతర వేషంలా ఉంది.

కేతకి తండ్రిని చూసి అన్నది: "నాన్నా ఎవరో వస్తు న్నారు" అని. గౌరయ్య చుట్టపారేసి లేచి నుంచున్నాడు. అతనికి మనిషి పోలిక తట్టలేదు. ఈ ప్రాంతంవాడు కాడులా ఉంది అనుకున్నాడు అస్పష్టంగా. కేతకి లోపలికి వెళ్ళిపోయింది.

అతను దగ్గరకు వచ్చాడు. సంచి ఓ మూలపెట్టి కండువా తీసి ముఖం తుడుచుకున్నాడు. కేతకి ఖాళీచేసిన రాతిబండ ఆక్రమించుకున్నాడు. గౌరయ్యను చూసి నవ్వుతో అడిగాడు. "ఈతోవ సరాసరిపోతే ఊరేదైనా వున్నదా?" అని. గౌరయ్య చెప్పాడు.

"నాలుగు వేపులా వున్నాయి. అయితే ఇంకో కోసెడు దూరం పోవాలి" అని అతను విసుగ్గా అన్నాడు.

"అయితే ఇంక ఇప్పుడు నేను పోలేను. ఈ పూట ఉండి, పొద్దున్నే పోతాను. ఉండవచ్చా" అని.

గౌరయ్య అతనికి జవాబు చెప్పలేదు. కేతకిని కేకవేసి చెప్పాడు. "ఇతను ఈ పూట ఇక్కడే ఉంటాడుట" అని. మళ్లా కొత్తచుట్ట ముట్టించాడు.

అప్పటికి బాగా చీకటిపడింది. ఆకాశమంతా నక్షత్రాలు మెరుస్తున్నాయి. అతను అలసిపోయినట్టు ఆ రాతిబండమీద

పడుకున్నాడు. పక్కన చెట్టుమీదనుంచి రాలిన పొగడపూలు గుట్టలుగా ఉన్నాయి. అతను ఆ పూలు గుప్పిడినిండా తీసుకుని ముఖాని కద్దుకున్నాడు.

"పాపం! అలసిపోయినట్లున్నాడు" అనుకున్నాడు గౌరయ్య.

కాస్సేపటికి చల్లని నీళ్ళు తెచ్చిఇచ్చింది కేతకి. అతను ఉలిక్కిపడి లేచాడు. కాళ్ళు, చేతులు, ముఖం కడుకున్నాడు. ఆమె కుండలలో మిగిలిన మజ్జిగ ఒక పాత్రలో పోసి తెచ్చి పెట్టింది. అతను అందుకున్నాడు. ఆమె వెళ్ళిపోయింది. అతను గౌరయ్యకేసి చూశాడు ప్రశ్నార్థకంగా. గౌరయ్య చెప్పాడు "నా కూతురు" అని. "మాటలు రావా?" అన్నాడు అమాయకంగా, ఆమె యంత్రంలా వచ్చి వెళ్ళిపోవడం తలచుకుంటూ. పరధ్యానంగా ఉన్న గౌరయ్య ఆ మాట వినిపించుకోలేదు. దూరంగా ఉన్న కేతకి ఆ మాటవిని నవ్వింది. అతన్ని చూడగానే ఆమెకు ఎన్నాళ్ళనుంచో ఎదురుచూస్తున్న బంధువు వచ్చినట్టు తోచింది. హృదయం సంతోషంతో నిండిపోయింది.

గౌరయ్య బాతాఖానీ ప్రారంభించి ఆచుట్టుపట్ల విశేషాలన్నీ చెప్పాడు. ఇంతలో కేతకి భోజనం తెచ్చింది. ఇద్దరికీ మధ్యగా దీపం పెట్టింది. రెండు కంచాల్లో అన్నం, రెండు చెంబుల్లో నీళ్ళు తెచ్చింది. భోజనం చేస్తున్నంతసేపు అతను కేతకినే వింతగా చూశాడు. పాకలోకి, బయటికి నిశ్శబ్దంగా తిరుగుతున్న ఆమె, ఆ మసక చీకట్లో ఏదో నీడ కదులుతున్న

ట్టుంది. అతనికి ఆశ్చర్యం వేసింది. భోజనమై లేవబోతూ అతను ఇంకొంచెం నీళ్ళు కావాలన్నాడు. ఆమె తెచ్చి పోసింది. వంగి చెంబులో నీళ్ళు పోస్తున్న ఆమె ముఖాన్ని అతను తదేక దీక్షగా చూశాడు. అది గమనించి కేతకి కంగారుపడింది. చాటుకు వెళ్ళి నవ్వుకుంది.

గౌరయ్య భోజనం కాగానే యథాప్రకారంగా, మామూలు చోట దుప్పటి పరచుకున్నాడు. "నీవు ఆ రాత్రి బండమీద పడుకుంటావా?" అన్నాడు అతనితో. అతను నిర్లక్ష్యంగా "ఎక్కడో పడుకుంటాలెండి. ముందు అల్లా కాస్సేపు తిరిగివస్తాను" అన్నాడు.

"ఈచీకట్లో ఎక్కడ తిరుగుతావు?" అన్నాడు గౌరయ్య భయంగా.

అతను నవ్వాడు.

"ఫరవాలేదులెండి. ఊరికే కొంచెం దూరం వెళ్ళి వస్తాను" అన్నాడు. గౌరయ్య నిశ్చింతగా నిదురపోయాడు.

ఆ వెళ్ళిన మనిషి గంటయినా రాలేదు. పాక ముందర చాప వేసుకు నక్షత్రాలను చూస్తూ పడుకున్న కేతకికి అతనిని గురించిన ఆలోచన లేదు. ఇల్లాంటి మనిషి నెప్పుడూ చూడ లేదు. ఎంత అందంగా ఉన్నాడనుకున్నది. అతని రంగు బట్టలు ఎంత బాగున్నాయనుకుంది. అతని నవ్వు ఎంతమధురంగా ఉన్న దనుకున్నది. అతను తన కేసి చూసినప్పుడల్లా తన్ను గాఢంగా

కౌగలించుకొన్నట్టనిపించింది. అది తలచుకుంటే ఒళ్ళు పులకరిస్తున్నది, ఏదో భయం వేస్తున్నది.

"నిద్రపట్టలేదా?" అన్నాడతను, ఉన్నట్టుండి. కేతకి అదరిపడ్డది. అతను అంతదగ్గరగా రావడం ఆమె గమనించనే లేదు. ఎంత నిశ్శబ్దంగా వచ్చాడు అనుకున్నది. కంగారుగా లేచి కూర్చున్నది, అతని కేసి చూస్తూ. అతను చిరునవ్వుతో చూశాడు. ఆమెకు ఆ చూపు తన ఒళ్ళంతా తడవినట్టనిపించింది. రెండు చేతులతో గుండెలు కప్పుకుంది. అతను మళ్లా చిరునవ్వుతో అన్నాడు: "నాకూ నిద్ర రావడం లేదు. అలా రారాదూ! ఆ రాతిబండమీద కూర్చుందాం. ఏవైనా కబుర్లు చెప్పుకోవచ్చు" అని. ఆమె యాంత్రికంగా లేచి మంత్రముగ్ధలా అతనితో నడచివెళ్ళింది. ఈ అపరిచిత వ్యక్తికి ఇంత చనువేమిటా అన్న స్పృహ ఆమెకా నిమిషాన లేదు. అతనితో ఎన్నాళ్ళనుంచో పరిచయం ఉన్నట్టనిపించింది. ఇన్నాళ్ళు ఎదురు చూసింది ఈ నిమిషంకోసమే ననిపించింది.

ఆ రాతిబండకు ఒక అంచున అతను కూర్చున్నాడు మరొక అంచున ఆమె కూర్చున్నది ఇద్దరికి మధ్యగా రాలిన పొగడపూలు దట్టంగా నిండి ఉన్నాయి. కబుర్లు చెప్పుకుందాం అని ఉత్సాహంగా పిలిచిన అతనికి ఏకబుర్లు తోచ లేదు. దిగులుగా చూస్తూ ఊరుకున్నాడు, కబుర్లు విందామని ఆసక్తితో వచ్చిన ఆమెకు అతను మాట్లాడడం లేదని తెలియు లేదు. చీర కొంగులు మెలిపెట్టుకుంటూ ఎంతో సరసమైన మాటలు

వింటున్నట్టు సిగ్గుపడుతూ కూర్చుంది. గాలి కదలినప్పుడల్లా పొగడపూల వానన ముంచెత్తుతున్నది.

అప్పుడు అతను అన్నాడు "ఈ పొగడచెట్టు చాలా ఏళ్ళగా ఉందా? ఎంత పెద్దదో?" అని. కేతకికి ఏంచెప్పాలో తెలియలేదు. బిత్తరపోయి ఊరుకుంది. తాను ఇక్కడికి వచ్చినప్పటినుంచి ఈ చెట్టు ఇంతపెద్దదిగానేవుంది. ఎనాళ్ళగా ఉందో ఎవరికి తెలుసు! తనకు చెట్టుక్రింద కూర్చోవడం, గుప్పిళ్ళతో పువ్వులు ఏరుకోడం, వేళ్ళసందుల్లోంచి జారవిడవడం మాత్రమే తెలుసు!

అతను మళ్ళీ అన్నాడు:

"ఈ పువ్వులు ఎంతమంచి వాసనో! ఇవి బారులుగా దండలుకట్టి నీ జడలో వేలాడగడితే ఎంత బాగుంటాయో! ఎందుకు పెట్టుకోలేవు?"

ఇది మరి ఒక అర్థంలేని ప్రశ్నగా తోచింది కేతకికి. ఆ పువ్వులు దండలుగుచ్చాలని పెట్టుకోవాలని ఎప్పుడూ అనిపించలేదు తనకు. ఊరికే దోసిలి నింపుకోవాలని తప్ప.

అతను మళ్ళా అన్నాడు. "నాసంచిలో దారం ఉన్నది. నేను గుచ్చనా!" అని. కేతకి నవ్వింది. ఈ రాత్రివేళ, ఈ నక్షత్రాల మినుకు మినుకుమనే కాంతిలో అతను పువ్వులు గుచ్చగలడా అనుకుంది. అతనూ నవ్వాడు. ఇద్దరికీ మధ్యగా వున్న పూలు అతను దోసిలితో తీసి ఆమెకిచ్చాడు. ఆమె మెలికలు తిప్పుతున్న పమిటకొంగు సరిచేసి అందుకుంది. కొంగున నిండిన

పూలు చేత్తో తీసి వాసనచూస్తూ బద్ధకంతో ఆవులించింది. "నిద్ర వస్తోంది." అంటూ లేచి నిలబడింది. అతను ఎంతో దిగులుగా ఆమెకేసి చూశాడు. ఆమె వెళ్ళిపోయింది, అతని కళ్ళకు నిద్ర రాలేదు. పొగడపూలు ఏరి పోగులు పోసుకున్నాడు. వేళ్ళతో లెక్కలు పెట్టుకున్నాడు. తెల్లవారింది.

కుండలతో నీళ్లు తెస్తున్న కేతకి అతనినిచూసి నవ్వింది. అతను దిగులుగా ముఖం వాల్చుకున్నాడు. అతనూ, గౌరయ్య ప్రయాణానికి సిద్ధంగా ఉన్నారు. కేతకి బిక్క మొహం వేసుకుంది. గౌరయ్య అన్నాడు.

"మా ఊరు వస్తారా?" అని.

"లేదు. నేను సరాసరి పోతాను. ఏ ఊరు తగిలితే ఆ ఊరు" అన్నాడతను.

గౌరయ్య కాస్త ఆగి అన్నాడు:

"మళ్ళా ఈ తోవన వస్తారా?" అని. అతను నవ్వుతూ అన్నాడు.

"నేను వచ్చినతోవను మళ్ళారాను. వెళ్ళిన చోటికి మళ్ళా వెళ్ళను. ప్రస్తుతం నాప్రయాణం ఇలాగే సాగుతోంది. కొన్నాళ్ళదాకా ఇంతే. ఇలాగే తిరగదలచుకున్నాను" అని అంటూ కేతకికేసి చూసి నవ్వాడు ఆ చూపు ఆమెను ఆఖరు సారి హృదయానికి హత్తుకుని సెలవుతీసుకుంటున్నట్టున్నది. కేతకి దిగులుతో తల వంచుకుంది. అతను సంచితీసుకు వెళ్ళిపోయాడు. గౌరయ్య కావడి తీసుకు వెళ్ళాడు.

కేతకి నిండుకుండలో నీళ్లు కింద పారపోసింది: ఖాళీకుండ క్రింద పడ వేసింది. తడిసిన కాళ్ళతో తడిసిన కుచ్చెళ్లు తడువుకుంటూ నీరసంగా ఆ రాతిబండమీద వెళ్ళి కూర్చుంది. కష్టపడి మోసి తెచ్చిన నీళ్లు ఎందుకు పారబోసిందో ఆమెకే అర్థం కాలేదు. చెమర్చుతున్న ముఖం పమిటచెంగుతో తుడుచుకుంది. పక్కన పొగడపూల దండలు వరుసగా పేర్చి కనబడ్డాయి, ఆమె తెల్లబోయింది. కళ్లు చెమ్మగిల్లాయి. అతనికి రాత్రి ఎట్లా గడిచిందో ఆమెకు అప్పుడు తెలిసింది. దండలు మెళ్లో వేసుకుంది.

పొద్దెక్కేదాకా అల్లాగే కూర్చుంది. పందిట్లో కుండలన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఆమె మళ్లీ నీళ్ళు తేలేదు. కమ్ముకుని వస్తూన్న శూన్యాన్ని ఎల్లాగూ నింపలేనని నిస్పృహతో ఊరుకుంది.

ఎండ కొఱకొఱమని వస్తున్నా ఆమె ఉన్నచోటు వదలి పోలేదు. ఆమె శరీరంలో శక్తి లేదు. మనస్సులో ఉత్సాహం లేదు. భూమిలో వేళ్ళు పాదుకుని సుఖంగా ఎదుగుతున్న లేత మొక్కను ఎవరో విలాసంగా పెకలించి శూన్యంలోకి విసిరివేసినట్టనిపించింది కేతకికి. తాను ఎన్నాళ్ళుగానో గుప్తంగా దాచుకున్న మమతను ఒక్కసారి కదిపి అతను తనతోవను తాను సాగిపోయినాడు. నిన్నటివరకు జీవితంలో దేనికోసమో యెదురు చూస్తోంది. ఇవ్వాళ కేవలం నిరాశమాత్రం మిగిలింది. అతను యెవరో తెలియదు. రాత్రి అతనితో తాను మాట్లాడినదీ లేదు.

అయినా జీవితం అతని యెదుట ఒక్కసారి పుష్పించి శాశ్వతంగా ముకుళించినట్టున్నది.

గౌరయ్య తిరిగివచ్చి చిందరవందరగా వున్న పందిరిపాక, ఖాళీకుండలు, ఎండలో శూన్యంగా కూర్చున్న కూతుర్ని చూశాడు కావిడిదింపి. కంగారు పడుతూ "ఒంట్లో బాగుండ లేదా?'' అని అడిగాడు కూతుర్ని.

"జ్వరంగాఉంది'' అంది కేతకి పరధ్యానంగా.

కూతుర్ని లోపలకెళ్ళి పండుకోమని తానే అన్నీ సర్దు కున్నాడు, నీళ్లు తెచ్చుకున్నాడు. ఇంతలో ఎవరో దారినపోయే వాళ్ళు వచ్చి పందిట్లో కూర్చున్నారు, కబుర్లు చెబుతూ.

పొద్దు వాలేకొద్ది కేతకికి భయమూ, బెంగా ఎక్కువైనాయి. మసకచీకట్లో ఇంక అక్కడ తాను ఉండలేననీ, ఆ పొగడ చెట్లను చూడలేననీ అనుకుంది. ప్రతి సంవత్సరమూ అక్కడికి ఎంతో ఉత్సాహంతో ఏదో ఆశతో వస్తోంది. ఒక్కసారిగా ఇంత ఎదురుచూడడానికి ఏమీ లేదనిపించింది. గుండెలో ఉండి ఉండి బాధిస్తున్న ఈశూన్యము ఇక్కడ నుంచి వెళ్లితేనే గాని తగ్గదేమో ననుకున్నది. తల దువ్వకుని, ముఖం కడుక్కుని తండ్రితో అన్నది. "నాకు ఒంట్లో బాగుండలేదు. ఇంటికి వెళ్ళిపోదాము" అని. గౌరయ్య కూడా అదే అనుకున్నాడు. "అవును నేనూ అదే ఆలోచిస్తున్నాను. పదపోదాం" అన్నాడు.

రోజులు గడిచేకొద్ది సుముఖికి కేతకి ఏదో మారిపోయి నట్లు తోచింది. ఇదివరకు ఎవరితో మాట్లాడకపోయినా ఉత్సా

హుంగా పనులు చేస్తూ ఉండేది. ఇప్పుడు ఏదైనా పని చెప్పినా మరచిపోతుంది. ఎంతసేపూ పెరట్లో పొగడపూలు ఏరుకుని సన్నజాజి పందిరిదగ్గర దండలు కడుతూ కూర్చుంటుంది. అవన్నీ రోజూ తన పెట్టెలో నింపుకుంటుంది.

చూడగా చూడగా, సుముఖికి ఈ పిల్లకు పెళ్ళి చేయడం తప్ప వేరే గత్యంతరం లేదని తోచింది. గౌరయ్య కుటుంబం కేశవయ్యగారిమీద ఆధారపడి ఉంది. అన్నీ ఆయన సలహా ప్రకారం జరగడమే అలవాటు. కేతకి పెళ్ళి విషయం ఆయనా ఆలోచిస్తూనే ఉన్నాడు. చివరకు ఓ సంబంధం చెప్పాడు. పొగడతోటకు దక్షిణంగా దేవనగరి అనే పల్లె ఉంది. అక్కడ నాగప్ప అని ఓ రైతు ఉన్నాడు బాగా పొలమూ అన్నీ ఉన్న వాడు. అతను కూడా కేశవయ్యగారికి కావలసినవాడు. అతనికి భార్య పోయింది. తల్లికి ఒక్తే చాకిరి అంతా చేసుకోలేకుండా ఉంది. అంచేత మళ్ళా పెళ్లి చేసుకోవాలను కున్నాడు. కేశవయ్యను అడిగాడు పిల్లను చూసిపెట్టమని. కేశవయ్యకు కేతకిని ఇవ్వవచ్చునని తోచింది. గౌరయ్యతో చెప్పాడు. అతను సరే నన్నాడు. కేశవయ్య పెళ్లి ఏర్పాట్లు చేశాడు.

సుముఖి మాత్రం అంతగా సంతోషించలేదు. ఆమె నాగప్పను ఎరుగును. నల్లగా బడ్డు పొడుగు పోతవిగ్రహంలా ఉంటాడు. చూస్తేనే ఏదో గుండెల్లో దడ పుడుతుంది. ఇంక నాగప్ప తల్లి నోటిదురుసు అందరికీ తెలిసినదే, అయినా గౌరయ్య, కేశవయ్య ఇద్దరూ కలిసి నిశ్చయించాక ఇంక చేసే

దేమున్నది! కేతకి అమాయకురాలు. దేవుడే కాపాడతాడని ఊరుకుంది.

పెళ్లి నిశ్చయమయిందని విన్నా కేతకి ఏమీ మాట్లాడ లేదు. ఎవరూ చూడకుండా కాస్సేపు ఏడ్చి ఊరుకుంది. నాకీ పెళ్లి వద్దని చెప్పలేదు. ఏమని చెపుతుంది?

"ఎప్పుడో ఒకరోజు, మసకచీకట్లో ఒక బాటసారి వచ్చాడు. అతను నన్ను పలకరించాడు. మళ్ళా తనతో వన తాను వెళ్ళాడు. అతనిపేరు నాకు తెలియదు, ఊరు తెలి యదు. అతను మళ్ళా కనిపిస్తాడని నమ్మకమూ లేదు. అయినా ఆజన్మాంతమూ, అతనికోసం ఎదురుచూస్తూ ఉంటాను, పెళ్లి చేసుకోను" అని చెబితే సుముఖ ఏమంటుంది? "అయ్యో పిచ్చి తల్లీ !" అంటుంది అంతకన్నా ఏముంది! అందుకే కేతకి మాటాడ లేదు.

పెళ్ళయిన పది రోజులకు నాగప్ప తిరిగి వచ్చాడు కేత కిని తీసుకుపోవడానికి. సుముఖ కేతకికి తలంటి నీళ్ళుపోసి, కొ త్త చీర కట్టి కళ్ళకు కాటుక, కాళ్ళకు పసుపూ పారాణీ పెట్టింది. తల్లో పువ్వులు పెట్టింది. పిండివంటలతో సహా భోజనం పెట్టింది. సాగనంపింది. వెళ్లబోతుండగా కేతకి దాచుకున్న పొగడదండ లన్నీ తెల్లని గుడ్డలో చుట్టి ఇచ్చింది. కేతకి అవి అందుకొని కంటతడిపెట్టుకుంది. తుడిచేసుకుని వెళ్ళిపోయింది.

పొద్దు వాలుతుండగా పొగడతోట చేరారు. ఇదివరకు కేతకి ఉన్న పాక ఆకులు రాలి ఏదో పాడుపడ్డట్టు భయంక

రంగా వుంది. దాన్ని చూడగానే కేతకికి ఒక్కసారిగా జీవిత మంతా ఎడారి అయినట్టు తోచింది. తాను కూర్చోవడానికి అలవాటుపడ్డ రాతిబండమీదే నాగప్ప వెళ్ళి కూర్చున్నాడు. ఆ పొగడచెట్టు పూలు అలాగే రాలివున్నాయి. కేతకి దాని దగ్గరకు పోలేకపోయింది. దూరంగా చతికిలపడింది. నాగప్ప బడాయిగా తన ఊళ్ళో తనకెంత పలుకుబడి, గౌరవంవున్నదీ గర్వంతో చెప్పుకున్నాడు. తన గౌరవానికి తగినట్టు మసలు కోవాలన్నాడు. "మా అమ్మకు కొంచెం నోటిదురుసు, నువ్వు తొందర పడకూడ'' దన్నాడు. కేతకి ఆ మాటలు వింటూ, తోవతప్పిన లేడిపిల్లలా బెదురుచూపులు చూస్తూ కూర్చుంది పరధ్యానంగా. ఇంక ఈ మాటలు జీవితాంతమూ వింటూ ఉండాలి కాబోలు అనుకుంది అమాయకంగా.

మళ్ళా నాగన్న అన్నాడు: "ఇంకో రెండుమైళ్ళుపోతే మన ఊరు వస్తుంది. లే, పోదాము" అని. కేతకి యాంత్రికంగా లేచి నిలబడింది ప్రయాణానికి. పోతూపోతూ ఆ పొగడపూల మూట ఆ రాతిబండమీద విసరిపారేసింది. అదేమిటని ప్రశ్నా ర్థకంగా చూశాడు నాగప్ప. "బరువుగా ఉంది. నేను మోయ లేను" అన్నది నిస్పృహతో కేతకి. నాగప్ప మళ్ళీ మాట్లాడ లేదు. కేతకి మళ్ళా తిరిగిచూడలేదు.